బీవోబీ లాభం 5,238 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.5,238 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,253 కోట్ల లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.32,033 కోట్ల నుంచి రూ.35,445 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీదనే రూ.30,263 కోట్లు సమకూరింది. క్రితం ఏడాది 3.32 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ ఈసారికిగాను 2.50 శాతానికి తగ్గిందని, అలాగే నికర నిరర్థక ఆస్తులు లేదా మొండి బకాయిలు 0.76 శాతం నుంచి 0.60 శాతానికి దిగాయి. క్యాపిటల్ అడెక్వసీ రేషియో 16.26 శాతానికి పెరిగింది.

రిలయన్స్ డిజిటల్‌లో ఎలక్ట్రానిక్స్ పండుగ



హైదరాబాద్, అక్టోబర్ 25: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల విక్రయ సంస్థ రిలయన్స్ డిజిటల్ దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్లలో ఎంపిక చేసిన బ్యాంకు కార్డులతో కొనుగోళ్లపై రూ.15 వేల వరకు తక్షణ డిస్కౌంట్‌ను కస్టమర్లకు అందిస్తున్నది. వచ్చే నెల 3 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ప్రత్యేక ఆఫర్ దేశవ్యాప్తంగా ఉన్న రిలయన్స్ డిజిటల్ స్టోర్లు/మై జియో స్టోర్లలో లభించనున్నది. దీంతోపాటు సామ్‌సంగ్ నియోక్యూ ఎల్ఈడీ టీవీని కొనుగోలు చేసిన వారికి రూ. 41,990 విలువైన 43 అంగుళాల స్మార్ట్ టీవీని ఉచితంగా అందిస్తున్నది. దీంతోపాటు రూ.46,900 విలువైన యాపిల్ వాచ్ సిరీస్ 10 ధరను రూ. 44,900కే విక్రయిస్తున్నది. తక్షణ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్‌తో రూ.45,900కే ఐఫోన్ 14కి అప్‌గ్రేడ్ చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే గృహోపకరణాలపై 15 శాతం వరకు తగ్గింపు ధరకే విక్రయిస్తున్నది.

జోస్ ఆలుక్కాస్ 'ఆహా దీపావళి'

బెంగళూరు, అక్టోబర్ 25: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్..వినియోగదారుల కోసం 'ఆహా దీపావళి' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.60 వేల విలువైన బంగారు ఆభరణాలను కొనుగోలు చేసిన వారికి వెండి నాణెం, వజ్రాలను కొనుగోలు చేసిన వారికి బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే విజియోగదారుల వజ్రాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం రాయితీని ఇస్తున్నట్లు కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు కస్టమర్లు తమ పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో ఎక్స్ఛేంజ్ చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, ధనత్రయోదశి కోసం ఈరోజు నుంచే అడ్వాన్స్ బుకింగ్‌లను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఫోక్స్‌వ్యాగన్ వర్చూస్ స్పందన భేష్

ముంబై, అక్టోబర్ 25: జర్మనీకి చెందిన కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్‌కి చెందిన వర్చూస్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన రెండేండ్లలోనే 50 వేల యూనిట్లు అమ్ముడయ్యాయి. సరాసరిగా ఒక్కరోజు 60 యూనిట్ల వర్చూస్ కారు అమ్ముడైందని ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్స్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. ఈ ఏడాదిలో 17 వేల కార్లు అమ్ముడయ్యాయి. వర్చూస్ జీటీ లైన్, వర్టస్ జీటీ ప్లస్ స్పోర్ట్ మాడళ్లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ప్రీమియం సెడాన్ విభాగంలో అత్యధికంగా అమ్ముడవుతున్నది వర్చూస్ అని ఆయన చెప్పారు. ప్రస్తుతేడాది రెండో త్రైమాసికం ముగిసేనాటికి వర్చూస్, టైగూన్ లక్ష వాహనాలు అమ్ముడయ్యాయి.

సాగునీటిని విడుదల చేయండి

కేఆర్ఎంబీకి ఏపీ సాగునీటి వినియోగదారుల సమాఖ్య వినతి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఏపీలోని 3వ జోన్‌కు నవంబర్ 15 నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు కోరారు. శుక్రవారం జలసౌధలో కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్ 589 అడుగుల(311 టీఎంసీలు)సామర్థ్యంతోపాటు 1.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే స్థితిలో ఉందని తెలిపారు. ప్రస్తుతం 3వ జోన్‌లో 2.11 లక్షల ఆయకట్టులో రైతులు ఆరుతడి పంటలు సాగు చేశారని, వాటికి నీటిని విడుదల చేయాల్సిన అవసరముందని తెలిపారు.

ఆధునీకరణ దిశగా 'కోయిల్‌సాగర్'

హైదరాబాద్, అక్టోబర్25 (నమస్తే తెలంగాణ) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్వహణను ఆధునీకరించనున్నారు. అధునాతన స్కాడ(సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) సిస్టమ్‌తో అనుసంధానం చేయనున్నారు. దాదాపు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను ప్రతిపాదించగా ఓఅండ్ఎం(ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) కమిటీ ఆమోదం తెలిపింది. జలసౌధలో ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు నేతృత్వంలో కమిటీ సమావేశం శుక్రవారం కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా 29 ప్రాజెక్టుల్లో పలు కాల్వలు, పంపింగ్ స్టేషన్లు, చెరువులకు సంబంధించి దాదాపు రూ.5 కోట్ల అంచనాలతో రూపొందించిన ఓఅండ్ఎం పనులపై కమిటీ ఈ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపింది. అందులో ప్రధానంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టును అధునాత 'స్కాడ'తో అనుసంధానించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటినిల్వలు, పంపింగ్ స్టేషన్లు, విద్యుత్ సరఫరా, గేట్ల నిర్వహణకు సంబంధించిన డేటాను మ్యానువల్ పద్ధతిలో సేకరిస్తున్నారు. అనంతరం డేటా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వ్యవస్థ 2008 నుంచి అందుబాటులో ఉన్నది. ప్రస్తుతం దాని స్థానంలో రియల్ టైం డేటా సేకరణ కోసం 'స్కాడ' సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించాలని నిర్ణయించారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.

సీతారామ-పాలేరు లింక్ కెనాల్ పనులకు టెండర్లు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, పాలేరు రిజర్వాయర్‌ను అనుసంధానించేందుకు ప్రతిపాదించిన 10.5 కి.మీ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం చీమలపాడు నుంచి ఎన్కూరు మండలం బుర్దా రాఘవాపురం వరకు దాదాపు 10.5 కి.మీ కాల్వను తవ్వి పాలేరు రిజర్వాయర్‌తో అనుసంధానించనున్నారు. అందుకు సంబంధించిన లింక్ కెనాల్ తవ్వకం, కట్ట నిర్మాణం, సీసీ లైనింగ్ తోపాటు ఇతర పనులకు రూ.190.73 కోట్లతో ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలుపగా, తాజాగా టెండర్లను కాల్‌ఫర్ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

నోటీస్ నెం.C/C/E-Auction & Manual Tender/SC/2024-25

తేది: 25-10-2024

FUEL 88

సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు భారత రాష్ట్రపతి తరపున కమర్షియల్ ఎర్నింగ్ మరియు NFR కాంట్రాక్ట్స్ కొరకు ఇ-ఆక్షన్ & మాన్యువల్ టెండర్ కోరుచున్నారు. తదనుగుణంగా SC డివిజన్ దిగువ కేటగిరీల కొరకు ఇ-ఆక్షన్ & మాన్యువల్ టెండర్ ప్రాసెస్ చేశారు. అవి https://www.ireps.gov.in/ వెబ్‌సైట్ & www.scr.indianrailways.gov.inలో ప్రకటించబడినవి.

క్ర.సం.	కేటగిరి	ఇ-వేలం తేది & మాన్యువల్ టెండర్ తేది
1	పార్కింగ్	29.10.2024 & 01.11.2024
2	పే అండ్ యూజ్ టాయిలెట్స్	30.10.2024
3	క్యాటరింగ్	31.10.2024 & 01.11.2024
4	EV (బ్యాటరీ స్వాపింగ్ & EV ఛార్జింగ్ స్టేషన్స్)	01.11.2024
5	RCR (రైలు కోచ్ రెస్టారెంట్)	02.11.2024
6	MPS	04.11.2024
7	బాక్స్ (BOXN వ్యాగన్ క్లీనింగ్)	04.11.2024
8	స్కాన్ (పార్సిల్ స్కానర్)	06.11.2024
9	ATM	06.11.2024 & 08.11.2024
10	హాల్ట్ ఏజెంట్ కాంట్రాక్టర్ల నియామకం	19.11.2024.

పార్టీలు పూర్తి వివరాల కొరకు https://www.ireps.gov.in/వెబ్‌సైట్ & www.scr.indianrailways.gov.inను దర్శించండి. విచారణలు/స్పష్టీకరణల కొరకు దిగువ సంతకందారు కార్యాలయాన్ని సంప్రదించండి.

సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్

A1391

ట్రంప్ గెలిస్తే.. ఐటీ కుదేలే..



ఫిలిప్‌క్యాపిటల్ తాజా నివేదిక • వీసా నిబంధనలు మరింత కఠినతరం • భారత ఐటీ కంపెనీలకు ఇబ్బందేనన్న అంచనా

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మదుపరులు అగ్రరాజ్యంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమెరికానే పెద్దన్న. అందుకే ఆ దేశాధినేతగా ఎవరొచ్చినా వారు తీసుకొనే నిర్ణయాల ప్రభావం మిగతా దేశాలపైనా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఈ ఎన్నికల్లో ఒకవేళ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే భారత్‌పై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా దేశీయ ఐటీ రంగం కుదేలవుతుందన్న అంచనాలు ఇప్పుడు వినిపిస్తుండటం గమనార్హం. ఫిలిప్‌క్యాపిటల్ తాజాగా విడుదల చేసిన నివేదిక ఇలాగే ఉన్నది మరి.

ఇలా గట్టెక్కవచ్చు..

అయితే ట్రంప్ అధికారంలోకి వస్తే ఏర్పడే సవాళ్లను అధిగమించడానికి భారతీయ ఐటీ కంపెనీలకు కొన్ని మార్గాలున్నాయనీ ఈ రిపోర్టు పేర్కొన్నది. అక్కడి మార్కెట్లలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించడం, డెలివరీ సెంటర్లు తెరవడం, సబ్‌కాంట్రాక్టర్లను పెట్టుకోవడం వంటివి కలిసి రావచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ట్రంప్‌కు పోటీగా భారతీయ మూలాలున్న, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ అధ్యక్ష ఎన్నికల్లో నిలబడ్డారు. ప్రస్తుత బైడెన్ ప్రభుత్వంలో హారిస్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నది తెలిసిందే. అయినప్పటికీ ట్రంప్‌కే ఎక్కువమంది ఓటర్లు మొగ్గుచూపుతున్నారన్న అంచనాలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఫిలిప్‌క్యాపిటల్ నివేదిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

మిగతా రంగాలపై..

అమెరికాలో ట్రంప్ మరోసారి అధికారంలోకి వస్తే.. భారతీయ రక్షణ, ఎనర్జీ, కమోడిటీస్ రంగాలకు లాభమేనని కూడా ఫిలిప్‌క్యాపిటల్ రిపోర్టు చెప్తున్నది. అమెరికాలో శిలాజ ఇంధన ఉత్పత్తి పెరిగి అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు, సహజ వాయువు ధరలు పడిపోవచ్చని, దీంతో వీటినే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న భారత్‌లో పెట్రో ధరలు దిగిరావచ్చని చెప్తున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు తగ్గుతాయని, ఫారెక్స్ రిజర్వులకూ బలం చేకూరుతుందన్న అభిప్రాయాలున్నాయి. ఇక ట్రంప్ హయాంలో ఈవీ ప్రోత్సాహకాలు ఉండకపోవచ్చని, ఇది భారత్ నుంచి అక్కడికి ఎగుమతి అవుతున్న ఈవీ విడిభాగాలకు ప్రతికూలమని అంటున్నారు. అయితే గతంలో మాదిరే చైనా పట్ల అధిక సుంకాలను ట్రంప్ తీసుకొచ్చే వీలుందని, ఇది భారత్‌కు కలిసిరాగలదన్న వాదనలున్నాయి. రక్షణ, కమోడిటీస్, టెక్స్‌టైల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగాల ఎగుమతులకూ డిమాండ్ పెరగవచ్చని తాజా రిపోర్టు అంచనా వేసింది. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరుగబోతున్నాయి.

వర్క్ వీసాలు కష్టమే

గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్.. అప్పట్లోనే వీసా పాలసీలు, వలస విధానాలపై కఠిన వైఖరిని ప్రదర్శించిన విషయం తెలిసిందే. మళ్లీ ట్రంపే గెలిస్తే.. అవే పరిస్థితులు నెలకొనవచ్చన్న అభిప్రాయాలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వర్క్ వీసా నిబంధనలు ఇంకా కఠినం కావచ్చని, ఇది భారతీయ ఐటీ కంపెనీలకు శరాఘాతంలా పరిణమించవచ్చని ఫిలిప్‌క్యాపిటల్ చెప్తున్నది. భారతీయ ఐటీ కంపెనీలు అమెరికా తదితర దేశాల ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఆధారపడి ఆర్జిస్తున్న సంగతి విదితమే. అక్కడికి భారతీయ ఉద్యోగులను పంపించి పని చేయిస్తున్నాయి. కానీ ఇప్పుడున్న బైడెన్‌కు ముందు ట్రంప్ కనబర్చిన వైఖరితో దేశ ఐటీ రంగం చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటూ వీసాలు రాకుండా అడ్డుకున్నారు. ఫలితంగా అమెరికన్లకు అన్నిరకాల నైపుణ్యాలను పెద్ద ఎత్తున ఖర్చుపెట్టిమరీ నేర్పించుకోవాల్సి వచ్చింది. అంతేగాక వేతనాలూ భారంగానే తయారయ్యాయి. భారత్‌తో పోల్చితే అక్కడి ఫ్రెషర్లకు ఎక్కువగా జీతాలివ్వాల్సి వచ్చింది. ఇది ఐటీ కంపెనీల ఆదాయం, లాభాలు, భారత్‌లో ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేసింది.

80 వేలకు దిగొచ్చిన పసిడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు దిగొచ్చింది. ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు కొనుగోళ్లకు ముందుకురాకపోవడంతో డిమాండ్ అనూహ్యంగా పడిపోయింది. దీంతో ధరలు తగ్గాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో శుక్రవారం ఒకేరోజు తులం బంగారం ధర రూ.1,150 తగ్గి రూ.80,050కి దిగింది. బంగారంతోపాటు వెండి కూడా భారీగా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల కొనుగోలుదారులు కొనుగోళ్లకు దూరంగా ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.2,000 తగ్గి రూ.99,000కి తగ్గింది. అంతకుముందు వెండి రూ.1.01 లక్షలుగా ఉన్నది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ పడిపోవడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీనంగా ఉండటం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ఆభరణాల విక్రయదారుడు వెల్లడించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు వీ హబ్ దన్ను

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వీ హబ్ సీఈవో పల్లచోళ్ల సీత తెలిపారు. శుక్రవారం వీ హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళ పారిశ్రామికవేత్తలకు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక ప్రభావంపై అవగాహన కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యాపార రంగంలోకి అడుగుపెట్టే మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వ్యాపార అభివృద్ధి, పెట్టుబడులు, నెట్‌వర్కింగ్, శిక్షణ, మెంటరింగ్ వంటి సేవలను వీ హబ్ అందిస్తున్నట్లుగా తెలిపారు. మహిళల నేతృత్వంలోనే పరిశ్రమలను పునర్నిర్మించడానికి అవసరమైన వనరులను అందించాలని ఇప్పటికే సోషల్ ఇంపాక్ట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, అర్బన్ ఇన్నోవేషన్ విభాగాలను నెలకొల్పినట్లుగా తెలిపారు.

ఎన్విరో ఫ్లూయిడ్స్ ఇండస్ట్రీ స్టార్ట్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): దండు మల్కాపూర్‌లోని టిఫ్ గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్క్‌లో ఎన్విరో ఫ్లూయిడ్స్ ఇండస్ట్రీని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఇండస్ట్రీయల్ పార్క్‌లో ఏర్పాటైన పరిశ్రమలను ఆమె సందర్శించి, ఇక్కడ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి, భవిష్యత్ పారిశ్రామిక అవసరాల గురించి టిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

బ్లూజే ఏరో చిన్నస్థాయి విమానం

హైదరాబాద్, అక్టోబర్ 25: నిట్టనిలువున పైకేగిరే విమానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నది రాష్ట్రానికి చెందిన బ్లూజే ఏరో సంస్థ. హైదరాబాద్‌కు సమీపంలోని నాదర్‌గుల్ ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ విమానాన్ని ప్రదర్శించింది సంస్థ. ప్రస్తుతం ట్రయిల్ దశలో ఉన్న ఈ మానవ రహిత విమానాన్ని వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు కంపెనీ కో-ఫౌండర్ ఉత్తమ్ కుమార్ తెలిపారు. పూర్తిగా బ్యాటరీతో నడిచే ఈ విమానం సింగిల్ చార్జింగ్‌తో 300 కిలోమీటర్లు, 100 కిలోల సామాగ్రిని తీసుకుపోనున్నదన్నారు. చిన్న స్థాయి నగరాల మధ్య లాజిస్టిక్ సేవలు అందించడానికి ఈ విమానం సరైనదని, ముఖ్యంగా మెడికల్, ఇతర అత్యవసర విభాగాలకు సరైనదని చెప్పారు.



పేదల ఇండ్లు కూల్చితే రణరంగమే

- **మహాధర్నాలో కిషన్ రెడ్డి హెచ్చరిక**
- **మూసీ కాలుష్యానికి కారణం కాంగ్రెస్: బండి సంజయ్**
- **పేదలు ఎవరూ ఆక్రమణలకు పాల్పడలేదు: ఈటల**

ధర్నాలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో మరో మంత్రి బండి, ఎంపీ ఈటల

చిక్కడపల్లి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజల ఇండ్లు కూల్చితే తెలంగాణ రణరంగంగా మారుతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి అన్నారు. పేదలు ఆక్రోశంతో ప్రభుత్వంపై తిరగబడితే ఏ పోలీసులూ అడ్డుకోలేరని హెచ్చరించారు. మూసీ బాధితులకు అండగా ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో శుక్రవారం బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ధర్నాలో పాల్గొన్న కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వం వైఖరి విడాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ్‌కుమార్ మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలన్నీ కలుషితమైపోయాయిని, ఇందుకు కారణం 40, 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటూ పేదల ఇండ్లు కూల్చడం దారుణమని మండిపడ్డారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ సీఎం పేదలెవరూ ఆక్రమణలకు పాల్పడలేదని పేర్కొన్నారు. ధర్నాలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్. ప్రభాకర్ పాల్గొన్నారు.

బలహీనపడిన 'దానా'

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): తీవ్రమైన తుఫానుగా మారిన 'దానా' చివరకు తుఫానుగా బలహీనపడినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఇది తీరం దాటిన 6 గంటల తర్వాత ఒడిశా వద్ద వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారుతుందని తెలిపారు. దీని ప్రభావంతో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఉంటుందని తెలిపింది. గరిష్ఠంగా 31 డిగ్రీలు, కనిష్ఠంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొంది.

ఈడీ విచారణకు అమోయ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐఏఎస్ అధికారి ఆమోయ్‌కుమార్‌ను ఈడీ వరుసగా మూడోరోజు విచారించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల బదిలీ వ్యవహారంలో అక్రమాలకు సంబంధించి అధికారులు ఆయను శుక్రవారం కూడా ప్రశ్నించారు. ఉదయం 6 గంటలకే అమోయ్‌కుమార్ ఈడీ కార్యాలయానికి చేరుకోగా.. 9 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు సుదీర్ఘంగా ఆయన ఈడీ ప్రశ్నలను ఎదుర్కొన్నారు. 42 ఎకరాల భూమి బదిలీ చేసినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ఈడీ అధికారులు ఆయనను రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చారు. కాగా.. మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఈడీ అధికారులకు అమోయ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. మధురానగర్‌లోని 104 ఎకరాలు భూమి ప్లాట్లు వేయగా, తాము కొనుగోలు చేశామని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆయన రికార్డులను తారుమారు చేసి ఇతరులకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. గతంలో ఈ విషయమై తాము పోరాటం చేశామని తెలిపారు. ఈ విషయంలో అమోయ్‌కుమార్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఈడీ అధికారులను కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలదే భవిష్యత్తు

- **ప్యూర్ ఈవీ ఎండీ డాక్టర్ నిషాంత్**